# ఆకాశవాణి విజయవాడ కేంద్రం

## ప్రాంతీయ వార్తా విభాగం

## ప్రాంతీయ వార్తలు

**తేది : 14-04-2024** **సమయం : 6.45 గంటలు**

---

# ముఖ్యాంశాలు

**1.** **ఎన్నికల ప్రచారంలో ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డి స్వల్పంగా గాయపడ్డారు.**

**2.** **రానున్న లోక్‌సభ ఎన్నికలకు బీజేపీ తమ మ్యానిఫెస్టోను భారత్ సంకల్ప పత్రం పేరుతో ఇవాళ విడుదల చేస్తుంది.**

**3.** **18 ఏళ్ళు నిండిన వారు ఈ నెల 15వ తేదీలోపు ఫారం-6ను సమర్పించి ఓటు హక్కు నమోదు చేసుకోవాలని రాష్ట్ర ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సూచించారు.**

**4.** **హైదరాబాద్‌లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలంగాణ పురపాలకశాఖ ప్రకటించింది.**

**5.** **ఉద్యోగుల భవిష్యనిధి నిల్వలపై ఈపీఎఫ్ సంస్థ మొదటిసారి గత ఆర్థిక సంవత్సరంలో లక్ష కోట్లకు పైగా వడ్డీ ఆదాయం ఆర్జించింది.**

=========================

ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్ రెడ్డిపై ఒక ఆగంతకుడు రాయి విసిరాడు. 'మేమంతా సిద్ధం' పేరుతో రాష్ట్రవ్యాప్తంగా ఎన్నికల ప్రచారం చేస్తున్న జగన్మోహన్ రెడ్డి, గతరాత్రి విజయవాడలో పర్యటిస్తున్నారు. ఆ క్రమంలో సింగ్‌నగర్ ప్రాంతంలో ఒక వ్యక్తి జగన్మోహన్ రెడ్డి మీదకు రాయి విసిరాడు. ఆ రాయి ముఖ్యమంత్రి ఎడమ కనుబొమ్మపైన తగిలింది. ముఖ్యమంత్రి కాన్వాయ్‌లోని వైద్యులు వెంటనే ప్రాథమిక చికిత్స చేసారు. బస్సుయాత్ర కేసరపల్లి చేరుకున్నాక అక్కడి నుంచి విజయవాడ ప్రభుత్వ ఆసుపత్రికి ముఖ్యమంత్రి చేరుకున్నారు. చికిత్స అనంతరం వైద్యుల సలహా మేరకు ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి ఇవాల్టి యాత్రకు విరామం ప్రకటించారు.

-------------------------

జగన్మోహన్ రెడ్డిపై దాడిని తీవ్రంగా ఖండిస్తున్నట్లు తెలుగుదేశం పార్టీ అధినేత చంద్రబాబునాయుడు ప్రకటించారు. ఆ ఘటనపై నిష్పాక్షికమైన దర్యాప్తు జరిపించి, బాధ్యులైన అధికారులను శిక్షించాలని ఎన్నికల కమిషన్‌కు విజ్ఞప్తి చేసారు. ఆ మేరకు ఆయన సామాజిక మాధ్యమం ఎక్స్‌లో ట్వీట్ చేసారు. జనసేన అధ్యక్షులు పవన్ కళ్యాణ్, బిజేపి రాష్ట్ర అధ్యక్షురాలు పురంధేశ్వరి కూడా ముఖ్యమంత్రిపై జరిగిన దాడిని ఖండించారు.

-------------------------

ఆంధ్రప్రదేశ్ కాంగ్రెస్ అధ్యక్షురాలు వైఎస్ షర్మిల... ముఖ్యమంత్రిపై దాడి ఘటన మీద స్పందించారు. జగన్మోహన్ రెడ్డి కంటిపైన గాయం కావడం బాధాకరం, అది ప్రమాదవశాత్తూ జరిగిన సంఘటన అయి ఉంటుందనుకుంటున్నామని ఆమె ప్రకటించారు. అలా కాకుండా ఎవరైనా కావాలని చేసి ఉంటే ఖండిస్తున్నామన్నారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, హింసను ప్రతీ ప్రజాస్వామికవాదీ ఖండించాల్సిందేనన్నారు. జగన్మోహన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని దేవుణ్ణి ప్రార్థిస్తున్నట్లు షర్మిల ఒక ప్రకటన విడుదల చేసారు.

---------------------------

రాయి దాడిలో గాయపడిన ఆంధ్రప్రదేశ్ ముఖ్యమంత్రి త్వరగా కోలుకోవాలని జాతీయ నాయకులు సందేశాలు పంపించారు. జగన్మోహన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని, ఆయన ఆరోగ్యం మెరుగుపడాలనీ ప్రార్థిస్తున్నట్లు ప్రధానమంత్రి నరేంద్రమోదీ ట్వీట్ చేసారు. జగన్మోహన్ రెడ్డిపై రాళ్ళ దాడిని ఖండిస్తున్నట్లు తమిళనాడు ముఖ్యమంత్రి ఎంకె స్టాలిన్ ట్విట్టర్‌లో ప్రకటించారు. రాజకీయ విభేదాలు హింసకు దారితీయకూడదని స్టాలిన్ వ్యాఖ్యానించారు. ప్రజాస్వామ్యంలో హింసకు తావులేదని, ఇటువంటి ఘటనలు జరగకుండా ఎన్నికల కమిషన్ చర్యలు తీసుకోవాలనీ బీఆర్ఎస్ నేత కె.తారకరామారావు ట్వీట్ చేసారు. జగన్మోహన్ రెడ్డిపై దాడి ఘటన తనను షాక్‌కు గురిచేసిందని పశ్చిమబెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ అన్నారు. జగన్మోహన్ రెడ్డి త్వరగా కోలుకోవాలని ప్రార్థిస్తున్నట్లు ఆమె ట్వీట్ చేసారు.

---------------------------

త్వరలో జరగబోయే పార్లమెంటు ఎన్నికలకు "భారత్ సంకల్ప పత్రం" పేరుతో మ్యానిఫెస్టోను బిజేపి ఇవాళ విడుదల చేస్తుంది. ప్రధాని నరేంద్రమోదీ, బీజేపీ జాతీయ అధ్యక్షుడు జేపీ నడ్డా, కేంద్ర మంత్రులు అమిత్ షా, రాజ్‌నాథ్ సింగ్ తదితరులు ఆ సంకల్ప పత్రాన్ని ఆవిష్కరిస్తారు. 'మోదీ గ్యారెంటీ: 2047 నాటికి వికసిత్ భారత్' అనే ఇతివృత్తంతో మ్యానిఫెస్టో రూపొందించారు. సంకల్పపత్రం కోసం బీజేపీ ప్రజల నుంచి అభిప్రాయాలు కోరింది. దాదాపు 15 లక్షల సూచనలు రాగా, వాటిలో 4 లక్షలకు పైగా అభిప్రాయాలు నమో యాప్ ద్వారా పంచుకున్నారు.

---------------------------

18 సంవత్సరాల వయసు నిండి.. ఓటర్ జాబితాలో పేరులేని వారంతా ఈనెల 15వ తేదీలోగా ఆన్‌లైన్ ద్వారా గానీ లేదా సంబంధిత రెవెన్యూ కార్యాలయాలు, మున్సిపల్ కార్యాలయాల్లో గానీ ఫారం-6ను సమర్పించడం ద్వారా ఓటు హక్కు నమోదు చేసుకోవాలని ఆంధ్రప్రదేశ్ ప్రధాన ఎన్నికల అధికారి ముఖేష్‌కుమార్ మీనా సూచించారు. ఈ నెల 15వ తేదీలోగా ఓటు హక్కును నమోదు చేసుకున్నవారందరికీ తప్పకుండా ఓటు హక్కు కల్పిస్తామని తెలిపారు. 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరూ ఓటర్‌గా నమోదు కావడమే కాకుండా మే 13వ తేదీన జరిగే పోలింగ్‌లో పాల్గొని ఓటు హక్కు వినియోగించుకోవాలని మీనా ఒక ప్రకటనలో విజ్ఞప్తి చేశారు.

---------------------------

త్వరలో జరగనున్న సార్వత్రిక ఎన్నికల్లో తొలిసారిగా వృద్ధులు, దివ్యాంగులకు ఇంటి నుంచి ఓటు వేసే వెసులుబాటును ఎన్నికల సంఘం అందుబాటులోకి తెచ్చింది. అందులో భాగంగా 85 ఏళ్లు పైబడినవారు, 40 శాతానికిపైగా అంగ వైకల్యం ఉన్నవారు ఇంటి నుంచే ఓటు వేయవచ్చు. నిబంధనలకు అనుగుణంగా ఓ కంపార్టుమెంట్, ఎలక్ట్రానిక్ ఓటింగ్ మిషన్‌ను తీసుకువచ్చి పోలింగ్ సిబ్బంది ఓటరు ఇంటి వద్దకే వచ్చి ఓటు వేయించుకుంటారు. ఇంటి నుంచే ఓటు వేసే వెసులుబాటును ఉపయోగించుకోవాలనుకునే వృద్ధులు, దివ్యాంగులు ఎన్నికల నోటిఫికేషన్ వచ్చిన 5 రోజుల్లో దరఖాస్తు చేసుకోవాలి. ఇందుకోసం ఫారం 12డి ని రిటర్నింగ్ అధికారికిగానీ,

సహాయ రిటర్నింగ్ అధికారికిగానీ పంపించాలి. దరఖాస్తు చేసుకునేవారు తమ పూర్తి చిరునామా, సంప్రదించాల్సిన ఫోన్ నంబరు పొందుపరచాలి. ఈ దరఖాస్తు ఎన్నికల సంఘం వెబ్ సైట్లో అందుబాటులో ఉంది.

---------------------------

భాహైదరాబాద్‌లో తాగునీటి సమస్య తలెత్తకుండా తగు జాగ్రత్తలు తీసుకుంటున్నామని తెలంగాణ పురపాలకశాఖ ముఖ్యకార్యదర్శి ఎం.దానకిశోర్ చెప్పారు. నాగార్జున సాగర్‌లో ఈనెల 15 నుంచి అత్యవసర పంపింగ్‌కు ఏర్పాట్లు పూర్తయినట్లు వెల్లడించారు. తాగునీటి సరఫరా అంశాలపై ఆయన శనివారం ఉన్నతస్థాయి సమీక్ష నిర్వహించారు. నీటి సరఫరాకు ఉద్దేశపూర్వకంగా ఆటంకం కలిగించే లైన్‌మెన్లపై కఠిన చర్యలుంటాయన్నారు. ఇప్పటివరకూ నలుగురు లైన్‌మెన్లపై సస్పెన్షన్ వేటు వేశామని చెప్పారు. బస్తీలలో తాగునీటి సరఫరాకు పైపులైన్లు నిర్మిస్తామని వెల్లడించారు. నగరంలో జలమండలి ఏర్పాటు చేసిన 101 చలివేంద్రాలకు ఆదరణ వస్తున్నట్లు తెలిపారు.

---------------------------

ఉద్యోగుల భవిష్యనిధి నిల్వలపై గత ఆర్థిక సంవత్సరంలో ఈపీఎఫ్ సంస్థ మొదటిసారిగా లక్ష కోట్లకు పైగా వడ్డీ ఆదాయం ఆర్జించింది. ఉద్యోగుల వేతనం నుంచి ప్రతి నెలా 12 శాతం చొప్పున వసూలు చేసే పిఎఫ్ నిల్వలపై ఆ ఆదాయం లభించింది. ఈపీఎఫ్‌వో నిల్వలను నిబంధనల మేరకు ఎక్స్ ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్స్‌లో, ప్రభుత్వ- ప్రైవేటు బాండ్లలో, ఫిక్సెడ్ డిపాజిట్ల రూపంలో సంస్థ పెట్టుబడులు పెడుతోంది. 2023-24 ఆర్థిక సంవత్సరంలో ఈటీఎఫ్ పెట్టుబడులపై వడ్డీ ఆదాయం రికార్డుస్థాయిలో లక్షా 4వేల 493 కోట్లు వస్తోందని ఈపీఎఫ్‌వో స్పష్టం చేసింది. దానివల్ల ఈపీఎఫ్ నిల్వలపై 2023-24 ఏడాదికి చందాదారులకు 8.25 శాతం చొప్పున వడ్డీ చెల్లిస్తామని తెలిపింది. కాలపరిమితి ముగిసిన ఈటీఎఫ్‌లను విక్రయించగా వచ్చిన సొమ్ములో 50 శాతాన్ని తిరిగి పెట్టుబడి పెట్టాలని నిర్ణయించింది. ఈటీఎఫ్ పెట్టుబడి కాలపరిమితిని నాలుగు నుంచి ఏడేళ్ళకు పెంచాలని భావిస్తోంది.

---------------------------

భారతరత్న , రాజ్యాంగ రూపశిల్పి అంటరానితనానికి వ్యతిరేకంగా పోరాటం జరిపిన డాక్టర్ భీమ్‌రావు రాంజీ అంబేద్కర్ 133వ జయంతి ఈరోజు. ఈ సందర్భంగా దేశానికి ఆ మహనీయుడు చేసిన సేవలను స్మరించుకుంటూ ప్రజలు ఆయనకు ఘనంగా నివాళులర్పిస్తున్నారు. దేశంలో సామాజిక, ఆర్థిక సాధికారత కోసం జీవితాంతం అలుపెరగని పోరాటం చేసిన డాక్టర్ అంబేద్కర్ 1891వ సంవత్సరం ఏప్రిల్ 14వ తేదీన ప్రస్తుత మధ్యప్రదేశ్ రాష్ట్రంలోని 'మౌ' అనే గ్రామంలో జన్మించారు. కొలంబియా విశ్వవిద్యాలయం, లండన్ విశ్వవిద్యాలయాల్లో ఉన్నత విద్యనభ్యసించి డాక్టరేట్ పట్టాలను పొందారు. న్యాయ, సామాజిక, ఆర్థిక శాస్త్రాలలో పరిశోధనలు చేశారు. న్యాయవాదిగా, అధ్యాపకునిగా, ఆర్థికవేత్తగా కూడా పనిచేశారు. తదనంతరం భారతదేశ స్వాతంత్ర్యం, పత్రికల ప్రచురణ, దళితుల, సామాజిక, రాజకీయ హక్కులు, భాతరదేశ రాజ్యాంగ వ్యవస్థాపన కోసం అకుంఠిత కృషి చేశారు. కేంద్రప్రభుత్వంలో భారతదేశ మొట్టమొదటి న్యాయశాఖా మంత్రిగా పనిచేశారు. 1956 డిశెంబర్ 6వ తేదీన తన 65వ సంవత్సరంలో తుదిశ్వాస విడిచారు. ఆయన దేశానికి చేసిన విశిష్ట సేవలకు గుర్తింపుగా భారత ప్రభుత్వం ఆ మహనీయుని మరణానంతరం అత్యున్నత పౌర పురస్కారం "భారతరత్న" తో సత్కరించింది. పార్లమెంటులో ఒక సందర్భంలో అంబేద్కర్ చేసిన ప్రసంగాన్ని ఇప్పుడు విందాం...

**...వాయిస్... 23 సెకన్లు....**

---------------------------

రాష్ట్రంలో భానుడి భగభగలు కొనసాగుతున్నాయి. ఇవాళ రాష్ట్రంలోని 18 మండలాల్లో తీవ్ర వడగాడ్పులు,151 మండలాల్లో వడగాడ్పులు వీచే అవకాశం ఉంది. సోమవారం 33 మండలాల్లో తీవ్రవడగాల్పులు,135 మండలాల్లో వడగాల్పులు వీచే అవకాశం ఉన్నట్లు ఆంధ్రప్రదేశ్ విపత్తుల సంస్థ ప్రకటించింది. శనివారం రాష్ట్రవ్యాప్తంగా 9 మండలాల్లో తీవ్రవడగాడ్పులు, 34 మండలాల్లో వడగాడ్పులు వీచాయని విపత్తుల సంస్థ తెలియజేసింది.

======================